# బుల్ బుల్

శ్రీ ఎ. సి. దత్తుగారు

'బుల్ బుల్, యిప్పుడు నీవయస్సెంత?'

ఆ అమ్మాయిని 'బుల్ బుల్' అనే పిలిచేవాడిని. ఎనిమిదిసంవత్సరాలక్రితం యీ 'బుల్ బుల్' తనంతట తానే రాగశూన్యమైన నాగృహంచొచ్చి అమృత సోనలు ఒలికించే తన మధురసంగీతంతో నాజీవితాన్ని ఆనందమయంగా ఒనర్చివేసింది. మొట్టమొదట పరిచయం కలిగినప్పుడు యీఅమ్మాయి పదేండ్లబాలిక. నా 'బంగ్లా'కు రెండుఫర్లాంగులదూరంలో ఒక చిన్న యింటిలో నివసిస్తూఉండేది. ఈమెతండ్రి రైల్వే ఆఫీసులో గుమస్తాగా ఉన్నాడు. నలభై అయిదు సంవత్సరాలకే ముసలివాడయిపోయాడు. తల్లి శాశ్వతంగా మంచంపట్టింది. తనకన్న పెద్దవాడు మెట్రిక్యులేషన్ ప్యాసయి యేపనిపాటులేకుండా ఉన్నాడు. చిన్నవాడు అరుసంవత్సరాలవాడు; అప్పుడే 'ఒనమా'లు దిద్దడం ప్రారంభించాడు. సంసారాన్ని నడిపించేబాధ్యత యీచిన్నిపాపమీద పడింది.

'ఈ వచ్చేపుట్టునదినంనాటికి పద్ధెనిమిది నిండుతాయి. గాని మామయ్యా, యెందుకలా అడుగుతున్నావు?' మేము బంధువులం కానప్పటికి నన్ను 'మామయ్యా' అని పిలిచేది.

'పద్దెనిమిదే! ఐతే వెంటనే వరుడ్ని చూడాలనుకుంటాను. ఎఱ్ఱగా, బుఱ్ఱగా, అందంగా చూడడానికి యింపు పుట్టేటట్టున్న అబ్బాయిని—అన్నిటికన్న ముఖ్యంగా—'

'ఏం వేళాకోళం పోనిద్దు మామయ్యా. నేనిప్పుడు పెండ్లాడడానికి చూడలేదే!'

'ఏం బుల్ బుల్! పెండ్లి చేసుకోవాలనిలేదా? మనసుకు నచ్చిన యేఅబ్బాయోవచ్చి యెత్తుకపోయే వరకు అందరు అలాగే అంటారు.'

'వేళాకోళంకాదు. నిజంగానే చెప్తున్నా—పెండ్లి చేసుకుంటె అత్తవారింటికి పోవాలనా? మరి యీ యిల్లేమవుతుంది. అమ్మ యేస్థితిలోవుందో నీకు తెలుసు; తనను యెవరుచూస్తారు. నాన్న రోజు రోజుకు శిథిలం అయిపోతూవున్నారు. ఆయన్ని చూచేవారెవరైనా ఉండాలనా? తమ్ముడు చిన్నవాడు; వాడిగతేంగాను. మరి వీళ్లందరకు వండిపెట్టేవాళ్లెవరు?—నే నత్తవారింటికిపోతే నువ్వు ఆపని చేస్తావా?'

'అలాగే. ఏదో నువ్వు వెళ్లేముందు కొద్దిగా ఆపని నేర్పించి వెళ్లిపో.'

మేమిద్దరం నా బంగ్లా వరండాలో కూర్చొని మాట్లాడుకుంటున్నాం. అప్పుడే చేరువగావున్న ఘడియారం, యెనిమిదిఘంటలు కొట్టింది. నేకూర్చున్న కుర్చీలోనే చేరబడి నిశ్శబ్ధంగావుండే ఆ నిశాప్రకృతిని తిలకిస్తుంటే నాఆలోచనలు ఆ నిర్మలాకాశంపై విహరిస్తున్న తెల్లని పిల్లమేఘాలతో సమానంగా పరుగులెడుతున్నాయి. నాజీవితంలో యీ చిన్ని బాలిక యేలాగున ప్రవేశించింది తలంచుకుంటే నాకే ఆశ్చర్యమేస్తుంది. ఒకనాడు నా'బంగ్లా'కు చేరువగా యీ బాలిక మోటారుకారుచేత త్రొక్కుడుపడిపోయింది. ప్రాణాలు పోవలసిందేకాని భగవంతుడు యీబాలిక చేత యేఘనకార్యం చేయించాలనో అంతపని జరుగనీయలేదు. నాకండ్లముందే ఆప్రమాదం జరిగిపోయింది. వెంటనే ఆబాలిక తండ్రిఅనుమతిపైని నా బంగళాలోనేవుంచి నాకు స్నేహితుడును వైద్యవిద్యలో పేరుగన్న ఒకడాక్టరుచేతులలో విడిచిపెట్టాను. కొన్నాళ్లకు పూర్తిగా తేరుకుని వాళ్ల యింటికి వెళ్లిపోయింది; గాని ప్రతిరోజు ఒక పర్యాయమైనావచ్చి నేనెలాగున్నది, యేంచేస్తున్నది కనుక్కొని వెళ్లిపోతుండేది. ఎనిమిది సంవత్సరాలనాటి సంగతిది; అప్పటికి పదిసంవత్సరాలబాలిక. ఆనాటి నుండి యీఅమ్మాయిమీద ఒకవిధమైన అనురాగం, అభిమానం కలిగాయి. వెధవకోర్టులలో రోజంతా

వినీకె త్తి యింటికివచ్చి యీబాలిక ముఖంచూచేసరికి ఆరోజుపడినకష్టమంతా మర్చిపోయేవాడిని. నాకు కులాసాగావుండి వినగలిగితేచాలు ఘంటలకొద్దీ తాను చూచినవస్తువులగురించి మాట్లాడేది. ఆలేతహృదయంలో యేవేవో భావాలు ఉప్పొంగిపోయేవి. రాధాకృష్ణులమీద సన్ననిగీతికలుపాడేది. నేను కాగితాలు తిరిగివేస్తూ నాపనిలో నేను మునిగిపోయివుంటే, నెమ్మదిగా ప్రక్కగదిలోనికిపోయి పుస్తకాలున్న బీరువాల నుండి యేదైనా పుస్తకంతీసి అందులోఉన్న బొమ్మలుచూస్తూ కూర్చునేది. మాత్రుభాషైనా అక్షరాలు తెలియని ఆబాలికకు యింగ్లీషులో వ్రాసివున్న విషయాలు ఏంతెలుస్తాయి. గాని తనమనసుకు నచ్చినట్టుగా అర్థం చేసుకొనేది. అప్పడే—ఆరోజులలోనే యీబాలిక సూక్ష్మబుద్ధికలదని సుస్పష్టరూపని గ్రహించగలిగాను. ఒకనాడు ఇంగ్లీషు, బెంగాళీ, చదువుకుంటావా అని అడిగేటప్పటికి యేమిటా ఆనందం! అందుచేత చివరగాఉన్న చిన్నగదినిచూచి దాన్ని పటములతోను అందంగాఉండే బొమ్మలతోను అలంకరించి కిటికీదగ్గరగా ఒకటేబులు, కుర్చీ ఉంచి ఆబాలిక విద్యఅభ్యసించడానికి కావలసినపుస్తకాలు జాగ్రత్తపెట్టాను. ఆరోజే ఆబాలిక విద్య అభ్యసించడానికి ప్రారంభదినం.

ప్రతిసాయంత్రం యెనిమిదిఘంటలు అయేటప్పటికి వచ్చి పదిఘంటలు కొట్టేవరకుఉండి నేచెప్పేదెల్లా నేర్చుకునేది. ఒకనెల గడిచింది. ఆసాయంత్రం మూడురూపాయిలుతెచ్చి నాచేతపెట్టింది. ఎందుకా రూపాయిలని నేనుప్రశ్నిస్తే చదువునేర్పుతున్నందుకు జీతమనిచెప్పింది. నాకు జీతం యీయనవసరంలేదు; నేనారూపాయిలు తీసుకోననిచెప్తే ఏంటేనా? వాళ్లమ్మచెప్పిందట. చదువునేర్పేవాళ్లకు జీతం యివ్వాలని. అందుచేత నేనెంతచెప్పినా తిరిగి ఆరూపాయలు తీసుకోలేదు. ఎంతోసొమ్ము ఆర్జించాను, యెంతో ఖర్చుచేశానుగాని, యీ మూడు రూపాయిలు నాకెంతో ఆనందంచేకూర్చాయి. అవే నానిధిగాభావిస్తూ జాగ్రత్తచేస్తున్నాను. నాకు వేరే పఠనమందిరం ఉందట; అలాగే ఆచిన్నగది తన యొక్క పఠనమందిరమట. నాపనులకు యే అంతరాయంకలుగకుండా తనయిష్టంవచ్చేటప్పుడు వస్తూపోతూ ఉండేటందుకు వీధిలోనికివున్న ద్వారానికి తాళంవేసుకుండేది.

ఈవిధంగా యెనిమిదిసంవత్సరాలు గడిచిపోయాయి. ఒకనాడు—

‘మామయ్యా, నాగదితాళంచేతులు తిరిగి నీకిచ్చివేయాలనుకుంటూను.’

ఈమాటలు నాచెవిని పడేటప్పటికి ఒక్కమారుగా ఉలికిపడ్డాను. మాయిద్దరిఆలోచనలు ఒకేదిక్కుగా ప్రవహించినందుకు చాలా విస్మయంకలిగింది. అప్పుడప్పుడు యీవిషయమయే నేనూ ఆలోచించేవాడిని గాని వెంటనే మర్చిపోతుండేవాడిని; యీరోజున గూడ యీఅమ్మాయిని చూచినవెంటనే, యిదే విషయం నాతలలో చొరబడింది. నేను వెంటనే తన ప్రశ్నకు జబాబు యివ్వకపోవడంచూచి బహుశా తనమాటలు వినలేదేమో అని తిరిగి అమాటలే అంది.

‘ఎందుచేత బుల్ బుల్?’

‘నాకైతే యివ్వాలనిలేదు; గాని యీవిషయమై మాఅన్నయ్యతో కలహం సంభవించింది. నిష్కపటమైన నీసలహా కావాలి.’

‘నీమాటలేమీ నాకుఅర్థంకావడంలేదు. స్పష్టంగా చెప్పు.’

‘నేనేమంత పెద్దదాన్ని అయిపోయానా? అంటే నీదగ్గర చదువుకోడానికి రాగూడనిప్రాయం నాకొచ్చిందా?’

‘అదేంటోనమ్మా! నీమాటలు నాకు స్పష్టంగా అర్థం కావడంలేదు.’

‘అలాగైతే చెప్తా విను. మాయిరుగుపొరుగువాళ్లేమేమో మాట్లాడుకుంటున్నారట. మాఅన్నయ్య

మాటల్నిబట్టిచూస్తే, వాళ్లు పద్దెనిమిది సంవత్సరాలొచ్చినపిల్ల చదువుకోడానికైనా రాత్రిపూట నీదగ్గరకురావడం బాగుండలేదని అంటున్నారు. పైవాళ్ల విషయాలలో పిలువని పేరంటంలాగు, జోసంటూ అనవసరంగా కలుగజేసుకోవడం యెందుకో ?- నేనెన్నడైన వాళ్లజోలికివెళ్లేనా ? ఆడదై పుట్టినందుకు పెండ్లిచేసుకోవడంతప్ప యింకేమీ ఉపయోగంలేదు కావోసు ! ఎన్నివిధాల నచ్చజెప్పినా మాఅన్నయ్య వినకపోతే నామనసులోఉన్నదిచెప్పేసి మరి మాట్లాడకుండాచేశాను. మనం యెన్నోకష్టాలలో మునిగి ఉండేటప్పుడు కన్నెత్తైనామాడని యీవేధవలు ఉదారస్వభావంగలిగిన ఒకస్నేహితుని దయవలన బాగుపడేసమయానికి వీళ్లకండ్లు యెర్రబడి చూడలేకుంటున్నారు. చూడలేనితనం కాకపోతే, మన సౌఖ్యానికి అడ్డువచ్చేటందుకు వీళ్లెవరని స్పష్టంగా చెప్పేశాను.'

'బుల్ బుల్ - ముందెప్పుడూ నువ్వింత కచ్చితంగాను నిర్భీతిగాను మాట్లాడడం యెరుగవే !'

'కాని మామయ్యా, యీనీచులఉద్దేశం యేంటో గ్రహించలేదా ? నువ్వు నన్ను తండ్రికన్న యెక్కువగా ఆదరిస్తున్నావు. యెంతో విలువైన నీసమయాన్ని ఘంటలకొద్దీ నాకు చదువుచెప్పడంలో వినియోగిస్తున్నావు. సాధారణంగా మనదేశంలో ప్రస్తుతం, స్త్రీలను చుట్టుకొనివున్న అజ్ఞానంనుండి నన్ను ఉద్ధరించి, నాలో అణగివున్న నిర్మలమై శ్రేష్టమైనభావాలను మెరుగుపెట్టి, దేశానికి సేవ చేయగలిగి మానవజన్మమెత్తినందుకు సార్థకంగా నా జీవితాన్ని మార్చడానికి ప్రయత్నిస్తున్న నిన్ను అనుమానించి, అనిరానిమాటలనడం న్యాయమా, ఆమాటలు వింటే దుర్భరమనిపించదా ?'

నేలేచి ఆఅమ్మాయి దగ్గరగావెళ్లి నెమ్మదిగా శిరస్సుపై చేయివేశాను. కన్నీటితోనిండిన ఆవిశాల నేత్రాలతో నాముఖంచూచింది.' వెంటనే చాలా సంవత్సరాలక్రితం 'పేరిస్' నగరంలో చూచిన సౌందర్యదేవతయొక్క పటం నాస్మరణకు వచ్చింది.

'బుల్ బుల్ ! వాళ్లెలాగనుకుంటే మనకేం ? మన జీవితాన్ని వాళ్లయిష్టప్రకారంగా త్రిప్పినడిపించలేం కదూ ! మనం నిర్దోషులమైతే భగవంతునిపై భారం వేసి నిశ్చింతగా వుండొచ్చు. వాళ్లన్నదికూడా అట్టే అసభ్యంగాలేదు; యెందుకంటావా, యెన్నో సంవత్సరాలనుండి వాడుకలోవున్న కొన్నిమర్యాదలకు, నియమాలకు కట్టుబడిన వీళ్లు హటాత్తుగా ఆ ఆచారాలకు వ్యతిరేకంగా తలంచనైనలేరు. వాళ్లేమనుకుంటేనేమి ? నువ్వుమాత్రం ఆమాటలను పట్టింపుచేయకు' అని నెమ్మదిగా బుజ్జగించాను.

నాయీమాటలు ఆఅమ్మాయిని కొద్దిగా ఓదార్చగలిగాయి, గాని కండ్లవెంట అశ్రువులుమాత్రం ప్రవహిస్తునేవున్నాయి. 'ఆహా ! మామయ్యా, నీదెంత విశాలహృదయం.' అన్నమాటలు నాచెవినిబడ్డాయి.

'బుల్ బుల్, నీకో చిన్నవిషయం చెప్పాలని చాలాదినాలయి ఆలోచిస్తున్నా. అది నామనసులోనే వుండిపోయి నన్ను చికాకు పెట్టేస్తుంది; దానిని వెలికక్కేస్తేనేగాని నాకు శాంతివుండదు.'

'ఏమిటది మామయ్యా ?'

'నీభవిష్యత్తు. రోజులు గడుస్తున్నకొద్దీ నా ప్రాయం పెరుగుతుందికదూ ? కొన్నాళ్లకు నీచదువు విషయమై అట్టే శ్రద్ధతీసుకోలేకపోతాను. ఇంకేవరైనా నీక్షేమంకోరేవాళ్లు వుండాలనా ? ఆరాబోయే సమయం విషయమయే నేనాలోచిస్తుంది. మనం యిద్దరంకలసి ఆలోచిస్తే యేదో వొక నిశ్చితాభిప్రాయానికి రావచ్చు.'

'అందరివలె నన్నుగూడ యెవరైనాచూచి పెండ్లి చేసుకోమంటావు. అంతేనా ?'

'నీకు యిష్టమైతేనే ! గాని యీవిషయమై బాగుగా ఆలోచించావా ?'

'బాగుగా ఆలోచించే నిశ్చయించాను. పరిస్థితుల బట్టిచూస్తే నేనేలాగు పెండ్లిచేసుకోలేను. ఇటువంటి క్లిష్టసమయంలో అమ్మను, నాన్ననువిడిచిపెట్టి నేను వెళ్లలేను. అదీగాక, నాన్నకుదొరికే అరవైరూపాయిలతో యింతవరకు యేలాగో సంసారం గడిపేను. రోజురోజుకు నాన్నగారిశరీరస్థితి యేమీ బాగుండడంలేదు. ఒకవేళ నాన్నగారికేమైనా సంభవిస్తే, నేను లేకపోతే యీయింటిని చూసేవాళ్లెవరు?'

'సరే. నీవన్నట్లే సంభవిస్తే కుటుంబాన్ని యెలా పోషిస్తావు?'

'మనస్ఫూర్తిగా ప్రయత్నిస్తాను. భగవంతుడు లేడా అనాథులను రక్షించడానికి—ఆదేవుడే నా యీ ప్రయత్నంలో సహాయంచేస్తాడు—మా నాన్నగారి జీతంనుండి నెలకు పదిరూపాయలుచొప్పున మూడు సంవత్సరములుగా జమచేస్తున్నాను. నువ్వు నాకిచ్చిన 'టైపుమిషను' చాలా ఉపయోగంగా ఉంది. నీకోర్టు కాగితాలన్నీ టైపుచేస్తే నెలకు యిరవైరూపాయిలు కిట్టవా? ఆపైని నాఅల్లికపని నెలకు అధమం పది రూపాయలైనా తెస్తుంది. ఇంతవరకు జమచేసిన పదిహేనువందల రూపాయిలు పోస్టాఫీసులో ఉన్నాయి. ఆమీద—'

ఈమాటలు వినేసరికి నాకు అపరిమితమైన ఆశ్చర్యం, ఆనందం కలిగాయి—ఏం వివేకం! యెంతటి స్ఫురద్రూపి!!

'నాన్నగారు నౌఖరీనుండి విరమించుకుంటే యీ సొమ్ము వలన చాలా సహాయం కలుగుతుంది. మామయ్యా! ఎక్కడైనా, ఏఆడపిల్లలబడిలోనైనా చిన్నవుద్యోగం—నెలకు యిరవైరూపాయిల జీతం చాలును—సంపాదించి పెడితివా, యీ సొమ్ము సహాయం లేకుండానే యేదో ఒకమోస్తరుగా కుటుంబ సంరక్షణ జరిగిపోతుంది.'

'అంటే, అప్పటివరకు, యిప్పుడేలాగున్నావో, అలాగే ఉంటావన్నమాట!'

'వేరే గత్యంతరంలేదు. నువ్వు యేదైనా సలహా యీయగలవా?'

'లేదు బుల్ బుల్! యిప్పట్లో నేనేమీ సూచించలేను. ఆలోచించాలి' అంటూ లేచాను.

'మామయ్యా, నాగదితాళంచేతులు తిరిగి నీకు యిచ్చివేయ్యాలా?'

'అక్కర్లేదు. అవి యిప్పటికీ నీవే. మీఅన్నయ్య తిరిగి చికాకుచేస్తే నాదగ్గరకు పంపించు. ఆవిషయమై నేనే ఆయనతో మాట్లాడుతాను.'

'నువ్వు చాలా బడలినట్టున్నావే! శరీరంలో కులాసాగాలేదా?'

'నాశరీరంలో కులాసాగానేవుంది' బాహ్యఅంతరవుల కెంటినిబట్టిచూడ యేదేవతకోసరమో చేయబడ్డ ఆచిన్నిశిరస్సును ముద్దుపెట్టుకొని 'శలవు' అంటూ లోనికి వెళ్లిపోయాను.

* * *

ఇంకోపదిసంవత్సరాలు గడచిపోయాయి.

బుల్ బుల్ తల్లిదండ్రులు గతించారు. పూర్వం వాళ్లుండే ఆయింటిని అమ్మివేశారు. బుల్ బుల్ అన్న బొంబాయిలో నౌఖరీచేస్తున్నాడు. చిన్నవాడు కాయకూరలు పండిస్తూ ఆవులను పెంచుతూ, వాటి వల్ల వచ్చేదానితో కాలక్షేపం చేస్తున్నాడు. చాలా లాభదాయకంగా ఉందట.—పూర్వం నేనుండే "టాలీగంజి" బంగ్లానుండి నానివాసం 'థీటర్ రోడ్డు'కు మార్చాను. ఈపదేండ్లలోనూ మాజీవితాలు చాలా మార్పుచెందాయి కాని పూర్వం నేనుండే ఆ 'బంగ్లా' అక్కడనేవుంది. అప్పుడప్పుడుమాత్రం వెళ్లి చూచి వస్తుండే వాడిని.

ఆవేళ ఆదివారం. ఉదయం తొమ్మిదిఘంటలవేళ బుల్ బుల్ పఠనమందిరంలో (పూర్వం నేనుండే బంగ్లా) పడకకుర్చీలోకూర్చొని గది నాలుగువైపులా చూశాను. పదిసంవత్సరాలక్రితం యేలాగుండేదో

యిప్పటికీ అలాగే ఉంది—కిటికీదగ్గరగా ఉంచబడిన టేబిలు, కుర్చీ, అక్కడనే వున్నాయి. ఆపుస్తకాలే ఆనాడు నేతెచ్చివుంచిన చిత్రాలే యిప్పటికి ఆగోడలను అలంకరిస్తున్నాయి. అప్పటికీ యిప్పటికి కలిగిన మార్పు మూడుఫోటోలుమాత్రమే. రెండు వాళ్లఅమ్మ నాన్నవి, మూడవది నాది. ప్రతిరోజూ పూలహారాలతో అలంకరిస్తూ ఆమూడుచిత్రాలే తనసర్వస్వం అనిభావిస్తూ యెంతో పవిత్రప్రేమతో వాటిని పూజిస్తూఉండి. గది చాలాశుభ్రంగా ఉంచబడింది.

ఈబంగ్లాకుదక్షిణంగా కొంతదూరంలో క్రొత్తగా ఒకమేడ కట్టబడింది. ఈమేడకు వెనుకతట్టున పశువులకై కట్టబడిన యెర్రనిపెంకుతో నేయబడి పశుశాలలున్నాయి. ఎడమవైపుగా విశాలంగాను, పరిశుభ్రమైన నల్లని నీటితోనిండిన ఒక చెరువువుంది. దాని చుట్టూ నానారకములైన ఫల, పుష్ప, వృక్షాలున్నాయి. ఆతెల్లనిమేడ, దానిచుట్టూఉండే పచ్చని పచ్చికబయళ్లు. తదితర పరిసరాలతో కన్నులపండువుగాఉండి మనసును హాయిగొల్పుతున్నాయి. సంతోషంతో ఉప్పొంగిపోతున్న హృదయంతో ఆప్రకృతి సౌందర్యాన్నిచూస్తూఉండగా పదములసవ్వడి వినబడింది. వెనుతిరిగిచూచేటప్పటికి తలుపుతెరచుకొని బుల్ బుల్ గదిలో ప్రవేశించింది. హఠాత్తుగా తలవనితలంపుగాకలిగిన యీసమావేశాన్నిచూచి తన కండ్లనే తాను నమ్మలేనట్లు ఆవిశాలమైనకండ్లను యింకా విశాలంగాచేసి నావైపు చూడసాగింది. ఒక్కక్షణకాలమే. వెంటనే ప్రపంచంలోఉన్న సంతోషం యావత్తుకలసి తనను ముప్పిరిగొన్నదేమో అన్నట్లు నవ్వుతూ 'మామయ్యా నేనెంతధన్యాత్మురాల్ని! ఎప్పుడొచ్చావు. ఏం, కబురుపెడితే నేనే నీబంగళాకు రాలేకపోయానా?' అంటూ దగ్గరగా వచ్చింది.

'నీపుట్టుకదినంనాడు నీకు కొద్దిగా ఆశ్చర్యం కల్గించాలని నీకు ముందుగా తెలియచేయకుండానే వచ్చాను. ఏం! యీవేళ నీపుట్టుకదినంకదూ?'

'నీకింకా జ్ఞాపకంవుంది మామయ్యా!'

'ఔను. ఏసంగతి మర్చిపోయినా నీజన్మదినం మాత్రం జ్ఞాపకముంటుంది. ఈవేళకు నీకు యిరవైయెనిమిది సంవత్సరాలు నిండాయికదూ?'

'ఔను. అతివేగరంగా సంవత్సరాలు దొర్లిపోతున్నాయి. గాని మామయ్యా, యిదేంటి?' అని టేబిలుదగ్గరగా వెళ్లి దానిపై ఉంచిన వస్తువును చుట్టివున్న కాగితాన్ని విప్పసాగింది.

'అబ్బే! ఏ మీ విలువైనది కాదు. ఏదో చిన్న వస్తువు నీకు ఉపయోగంగా ఉంటుందని తీసుకవచ్చాను బుల్ బుల్.'

కాగితాన్ని పూర్తిగావిప్పి—'టైపుమిషను!! నేనెన్నడు ఆకాగితంలో చుట్టివున్న వస్తువు టైపు మిషనని అనుకోనైనలేదు. గాని యిదెందుకు మామయ్యా?'

'జన్మదినపు కానుక. ఏవస్తువు నీకు ఉపయోగంగా ఉంటుందని ఆలోచించి నీదగ్గరవున్నది యీపాటుకి మూలబడివుంటుందని భావించి దీనిని తీసుకవచ్చాను.'

నా యీమాటలు వినగానే చట్టున వెనుతిరిగి కిటికీదగ్గరకుపోయి నిల్చొని యేడ్వసాగింది. నేనేమీ ఓదార్చ ప్రయత్నించలేదు. నా హృదయం ద్రవించిపోయి నా కండ్లవెంటగూడ అశ్రువులు రాలాయి. కొంతసేపటికి తనచీర చెరగుతో కండ్లు వొత్తుకొని, తన హృదయావస్థను ప్రకటిస్తున్న ఆ ప్రకాశవంతమైన చిన్నిమోముపై చిరునవ్వు నాట్యమాడుతూఉంటే నాదగ్గరగావచ్చి "నిజంగా దీనివల్ల చాలా ఉపయోగంవుంది. దీనిని భద్రంగా ఉంచుకుంటాను మామయ్యా" అని నా ప్రక్కనేఉన్న కుర్చీలో కూర్చుంది; కూర్చొని నా సిగరెట్టుపెట్టినుండి ఒక సిగరెట్టుతీసి నా నోటబెట్టి నిప్పుముట్టిస్తూ "నీ కే సిగరెట్లు యిష్టం మామయ్యా? యీపర్యాయం నువ్వు వచ్చేటప్పటికి సిద్ధంగా ఒకటిన్ను కొని ఉంచుతాను" అంది.

'సరే గాని బుల్ బుల్ నీకు యీ ఉపాధ్యాయినీ వృత్తి అనుకూలంగా ఉందా?'

'మరేవృత్తైన యింతకన్న యెక్కువ సంతోషం కలుగజేస్తుందని అనుకోను. ప్రస్తుతం మా స్కూలు చాలా బాగుంది. రోజురోజుకు వృద్ధిపొందుతూ వుంది.'

'కాదామరి. భగవంతుని ఆశీర్వాదనులు బడసిన నీకేమమ్మా?'

'నిజంగా అంతే మామయ్యా. ఆ భగవంతుని ఆశీర్వాదమే నన్నింతవరకు తెచ్చింది. మా స్కూలు (బోర్డింగుస్కూలు)లో పన్రెండేండునుండి పద్దెనిమిది సంవత్సరాల ప్రాయంగలిగిన బాలికలు ముప్పై మంది ఉన్నారు. వాళ్లు యిచ్చే జీతాలమూలంగా నెలకు తొమ్మిదివందల రూపాయిలు వసూలు అవుతున్నాయి. దానితోనే స్కూలును నడిపేటందుకయే ఖర్చులన్నీ భరిస్తున్నాం. ఆయా శాఖలలో ఉన్న బాలికలు వాళ్లకు విధించిన పనులు చాలా తెలివిగాను చురుకుగాను చేస్తున్నారు. ఈవిధంగా కొన్నాళ్లవరకు నడిచిందంటే అఉన్న కొద్ది నౌఖరీ వాళ్లను తీసివేయవచ్చు.'

'అంటే నౌఖరీవాళ్లు లేకుండానే మీ స్కూలును నడిపించాలనివుందా యేం బుల్ బుల్?'

'అవును. నువ్వు చూపిన సూచన నేకదూ! దానిని కార్యరూపంగా కొనసాగించాలనివుంది. ఇంటి సంబంధమైన పనులు—వంట బట్టలు ఉతుకుట, ఆవుల సంరక్షణ, తోట, యింటిశుభ్రత యీ ఐదింటికీగాను, ఆ ముప్పై అమ్మాయిలను ఐదుజతలగా విడదీసి యేయేపనులలో అభిరుచి ఉన్నవాళ్లకు ఆయాపనులు విధించాం. నువ్వు ఒకపర్యాయంవచ్చి మా వంటిల్లు చూడవలసింది—నేలకాదు; గాజులా మెరిసిపోతుంది—కంచుగిన్నెలు బంగారపు గిన్నెలా అన్నట్టు ఉంటాయి. అందరూ వంటనేర్చుకున్నారు. అందుచేత వంటపుట్టీలను చాలాదినాలక్రితమే మాన్పించివేశాం. బట్టలు ఉతికేటందుకు కావలసిన నౌకర్యాలన్నీ ఉన్నాయి. ఈ బాలికలే అందరి బట్టలు శుభ్రంచేస్తారు. ఆపైని ముప్పై ఆవులున్నాయి. అవి యిచ్చే పాలు మా అందరికోసరం ఖర్చుకాగా యింకా చాలామట్టుకు మిగిలిపోతాయి.'

'మరి యిన్ని ఆవుల్ని పెంచడానికి తక్కువ ఖర్చు అవుతుందా?'

'నువ్వు అనుకున్నంతమట్టుకు కాదు. ముప్పై ఆవులలోను పది వట్టిపోయాయి—యిరవై పాలిస్తున్నాయి. రోజుకు సగటున నూరుశేర్లు పాలిస్తాయి. మా అందరిక్రింద నలభై శేర్లు ఖర్చుకాగా మిగిలిన అరవై శేర్లు రూపాయికి నాలుగుశేర్ల చొప్పున అమ్మివేస్తున్నాం. దానిమూలంగా సంవత్సరానికి మూడువేల తొమ్మిది వందల డెబ్బైఅయిదు రూపాయిలు వస్తున్నాయి. నాలుగు సంవత్సరాలై యిలాగున చేస్తుంటే యిప్పటికి పదహారువేల రూపాయిలు జమ చేయగలిగాం.'

'పదహారువేలే!! ఓ భగవంతుడా పాలవల్ల ఇంత మట్టుకు జమచేయగలవచ్చునని నే నెన్నడు తలంచనైనాలేదు. గాని యీ ఆవులనన్నిటిని యెవరు చూస్తారు?'

'మాదగ్గరఉన్న నలుగురు నౌకర్ల సహాయంతో మా బోర్డర్లే పాలు పితుకుతారు—మా స్కూలు చుట్టూ కావలసినంత పచ్చికబయల్లున్నాయి, గాని ఆవులు పుష్టిగా ఉండేటందుకు మంచి మేతపెట్టాలను. సాధారణంగా మా బజారుఖర్చు చాలా తక్కువగా అవడంచేత యీ అమ్మాయిలిచ్చే జీతంలోదే ఆవులకయే ఖర్చుకూడ భరిస్తున్నాం.'

'మీ ఉద్దేశం యేంటి బుల్ బుల్! మీ బోర్డర్లను కడకు గొల్లభామలగా చేయరుకదా!'

'వాళ్లు ఆరోగ్యంగాను, చురుకుగాను, బలంగాను

ఉండేటందుకు సరియైన శిక్షయిస్తూన్నాం. ఈ స్కూలు విడిచిపెట్టగానే వాళ్ల అదృష్టవశాత్తు యెటువంటి పరిస్థితులలో మెలగవలసివస్తే ఆపరిస్థితులకు అనుకూలంగా జీవితాన్ని గడిపేటందుకు సిద్ధంగా ఉండగలందులకే వీళ్లకు యిప్పటినుంచీ శిక్షయిస్తూన్నాం. వాళ్లు ప్రతిరోజు యింట్లోచేసే పనుల విషయమై చెప్తా విను—తెల్లవారి అయిదు ఘంటలకులేచి కాలకృత్యాలు తీర్చుకొని, వెచ్చని పాలు గిన్నెడు త్రాగి యింటిని శుభ్రంచేయడానికి ఆరంభిస్తారు. అన్ని నట్టిల్లను వూడ్చడం సామానుల మీద రాలిని ధూళిని తుడవడం, పక్కలు, బట్టల యెండలో ఆరవేయడం, అద్దాల్ని పటాల్ని బాగుగా తుడిచి, కంచుగిన్నెలు బంగారపుగిన్నెలలాగు మెరసే వరకు తోమిపెట్టడం యిదంతా తక్కువసేపవుతుందా యేంటి. సాధారణంగా తొమ్మిది ఘంటలకు యీపని పూర్తిఅయాక తోటపని చూస్తారు. మొక్కలకు కావలసిన గెత్తాము, నీళ్లు మొదలైనవి చూచుకొని, కావలసిన కూరలు, పండ్లు కోసుకొని వస్తారు. ఇంచుమించుగ అన్నిరకముల పండ్లచెట్లు కూరమొక్కలు ఉన్నాయి మాతోటలో; మాకు కావలసినదానికన్న యెక్కువగా కాస్తున్నాయి. మాకై ఖర్చుకాగా మిగిలినవి అమ్మివేసి సంవత్సరానికి వేయిరూపాయిలు సంపాదించగలుగుతున్నాం. పైనిచెప్పిన పనులన్నీ యీ బాలికలు చేయడంచేత మన దేశస్త్రీలకు ఆవశ్యకమైన శరీరబలం, చురుకుదనం, నియమానుసారంగా పనిచేయడం మొదలైనవి వీళ్లకు యిక్కడనే అలవడుతాయి.'

'ఈపనులెల్ల చేస్తుంటే వాళ్లుచదువుకునే దెప్పుడు?'

'చదువుకొందుకు వాళ్లకు కావలసినంత సమయముంది. పండ్రెండుఘంటలకు భోజనంచేసి యెవరెవరి క్లాసులకు వాళ్లు హాజరవుతారు. సాయంత్రం నాలుగు ఘంటలకు చదువుపూర్తి అవుతుంది. నాలుగుఘంటలు శ్రద్ధతో చదివితేచాలదా, అనవసరంగా వాళ్లలేత మెదడుకు యెక్కువ శ్రమయిస్తేమాత్రం యేంలాభం; వెంటనే మర్చిపోతారు. మామయ్యా నువ్వు నాకు దినానికి రెండుగంటలేకదూ చదువుచెప్పేవాడివి; యెనిమిది సంవత్సరాలలో మెట్రిక్యులేషన్ పూర్తి చేశానా; నా పరీక్షాఫలితాలు బాగుండలేదా!—పిల్లలకు చదువుపై శ్రద్ధపుట్టేటట్టు క్లాసులను నిర్ణయిస్తాం. ఇంగ్లీషు, బెంగాలీ, లెక్కలు, యివిఅందరు చదవవలసినవే, కాని మిగతా విషయాలు యెవరికేని యిష్టమైతే అవే నేర్చుకుంటారు. సాయంత్రం నాలుగునుండి ఆరుఘంటలవరకు తోటలో ఆడుకొని ఆరున్నరకు స్నానాలు అయాక భోజనంచేసి యెమ్మిది ఘంటలవరకు కుట్టుపని, అల్లికపని, చేసుకొని అప్పుడు నిద్రపోతారు. తొమ్మిదిఘంటలు కొట్టేటప్పటికి అందరు వాళ్లవాళ్ల పనులు కట్టిపెట్టి నిద్రపోవలసిందే.'

వింటున్నకొద్దీ నాకు ఆనందంయెక్కువై పోతూ ఉంటే మరొకసిగరెట్టు ముట్టించి వింటున్నాను.

'ఎంతకష్టంగా మా ఖర్చులు సరిపెట్టుకుంటున్నామో చూస్తే పైవాళ్లకు ఆశ్చర్యంగానే వుంటుంది. మాకు కావలసినవస్తువులకై—యేకొద్దిపాటి కోసరమో తప్ప—మేము బజారుపై ఆధారపడం.'

'నిజంగా నీవొక అద్భుతవ్యక్తివి బుల్‌బుల్! మీ నాన్నవాళ్లుండేరోజులలో సంసారాన్ని పొందికగా నడిపించేటప్పుడే నువ్వు చాలా జాగ్రతగలదానవని గ్రహించాను. గాని యీ చిన్నితలలో వేరేఒక ప్రపంచాన్నే సృజింపగలజ్ఞానం యిమిడివుందని తలంచనైనా లేదుసుమా! నువ్వు, శిథిలమై, నామమాత్రావశిష్టమైన సనాతన భారతనారీధర్మాలను మరల పునరుద్ధరిస్తున్నావు బుల్‌బుల్. ఈకాలాన్ని బట్టిచూస్తే నీవొక నూతన స్త్రీత్వమునే ప్రవేశపెడుతున్నావు.'

'మామయ్యా, నేనుచేసిందేముంది గనుక నీవంతగా పొగడడానికి? నువ్వు కనబరచిన సూచనలే—నీధన సహాయం మూలాన్నే, మేముశ్రద్ధగా పనిచేసి కార్య

రూపంగా నిరూపించగలిగాం. మేముచేసిన దానిలో అబ్బే ఆశ్చర్యపడవలసిం దేమీలేదే! శరీరశ్రమను లక్ష్యపెట్టక, సంఘీభావంతో గూడుకున్న కార్యదీక్ష ఉంటేచాలును. ఈగుణాలు ప్రతిభారత స్త్రీయందు ఉన్నాయిగాని వాళ్లకు తగినపరిస్థితులు కలిగించి నడిపించేవాళ్లులేరు— నీలాంటివాళ్లు చాలా అరుదు. మాదగ్గర శిక్షనుపొందుతున్న యీ బాలికలు, బలంగాను ఆరోగ్యంగాను, చురుకుగాను, నియమితాను సారంగా మసలుటకుగాను, వీళ్లను తయారుచేసి, స్త్రీయై జన్మించినందుకుగా విద్యుక్తధర్మం బాధ్యత వీళ్ల మనసులకు యిప్పటినుండీ తప్పేటట్టు ప్రయత్నిస్తున్నాం. మేముపిల్లలకు యిచ్చేశిక్ష గృహలక్ష్మి (-భార్యగాను, తల్లిగాను-)కి కావలసినవిద్య, అనుభవాలే కాకుండా,అత్యవసరమని తోచినప్పుడు కుటుంబ పోషణకు కావలసిన ధనమును సంపాదించు కొనుటకుగూడ ఉపకరిస్తుంది. మామయ్యా చెప్తేనీకు ఆశ్చర్యం కలుగుతుందేమోకాని యింతగా అభివృద్ధిపొందడానికి అప్పుడప్పుడు యీ బాలికలు సూచించే పద్ధతులే కారణం. ఇప్పటివరకు మేము జమచేయగలిగిన ధనంతో లలితకళలను ప్రవేశపెట్టడానికి ఒక పెద్దహాలును కట్టించాలని ఆలోచిస్తున్నాం. కొందరు పెద్దమనుష్యులు గూడ ధనసహాయం చేస్తామని మాటయిచ్చారు. ఒక సంవత్సరంలోగా యీపని నెరవార్చాలనివుంది. వారానికి ఒకపర్యాయం స్కూలువేళలలో నేర్పడానికి వీలులేని విషయాన్ని బోధిస్తూ అప్పుడప్పుడు సినిమా ప్రదర్శనాలను ప్రవేశపెడుతుంటే యీ బాలికల విద్యార్థిజీవితం చాలాహాయిగా గడచిపోతుంది. మామయ్యా, యీబాలికలు స్కూలువిడిచి వాళ్ల యిండ్లకుపోయేటప్పుడు వీళ్లనుచూచి మనదేశం మెచ్చుకుని, మురిసిపోతుంది.'

'బుల్ బుల్ నీఉత్సాహంచూస్తే నాహృదయం ఉప్పొంగిపోతుంది. భగవంతుడు నీయీ ఉత్కృష్ట ఉద్యమాన్ని కాపాడుతూనిన్ను సఫలీకృతురాలినిగా చేస్తాడు. అర్థంగానికొన్ని పురాతనఆచారాలు కొంతవరకు అడ్డుతగలవచ్చు; గాని నీఉత్సాహం పట్టుదల ముందుగా నిల్చోడానికి వాటికిశక్తిచాలదు. స్త్రీల జీవితం, దానిననుసరించి తతిమాలోకమంతా యెంత మనోహరంగా మారిపోతుంది. వందలకొద్దీ బాలికలు యీ స్కూలులో శిక్షపొందగలరు; ధనవంతులు పేద వాళ్లనేభేదం లేకుండా సౌఖ్యాన్ని, ఆనందాన్ని వాళ్ల యిండ్లకు కొనిపోగలరు. -ఇదంతాస్వప్నమేనా! కాదు—కానేరదు—ఒక్క చిన్నిచిలుకే యేకాకిగా ఉన్నఒకవ్యక్తి శూన్యగృహంచొచ్చి తన మధుర సంగీతంతో ఆగృహాన్ని ఆనందమయంగాచేసి, ఆవ్యక్తి జీవితాన్నే మార్చివేయగలిగినప్పుడు ప్రతీయింటా ఒక బుల్ బుల్ అంటే నిజంగా యీభూలోకం స్వర్గంగా మారిపోదా!'

బుల్ బుల్, యేమీ మాటాడకుండా నావైపు నిదానంగా చూడసాగింది.

'బుల్ బుల్, నావృత్తిలోనేను అదృష్టవంతుడనే, చాలాడబ్బు గడించాను; అలాగే హద్దుమీరి ఖర్చు చేశాను. నాజీవితంలో ఒక సంకల్పమున్నది ఉండేది కాదు. అటువంటిసమయంలో నీతోపరిచయం కలిగింది. సాయంత్రపువేళలలో నీవువస్తూఉంటే నేను కోర్టులలో రోజంతాపడినకష్టం మర్చిపోయేవాడిని, కేవలంనా విలాసంకోసరమే నీకుచదువుచెప్పడం ఆరంభించాను. క్రమేపీనీవు నాగృహంలోనేకాదు-నాజీవితంలో గూడ ఒకభాగంగా మారిపోయావు—నిన్ను భగవంతుని కృపవలనగలిగిన నా ముద్దులబిడ్డగా భావించి ప్రేమించాను. నేచేయబోయే ధనసహాయాన్ని పరిగ్రహించనప్పటికి మీకుటుంబ విషయమై నీవెంతకష్టపడుతుండేదీ నేను కనిపెట్టాను. నీభవిష్యత్తు సూచించేవరకు ఒకనిర్ణయానికి రాలేకపోయాను. బుల్ బుల్ నీవొకనాడు సాయంత్రం నీగదితాళం తిరిగినాకు యిచ్చివేయాలని వచ్చావు జ్ఞాపకం—వుందా?'

'వుందిమామయ్యా.'

పెళ్లిచేసుకోమని సలహాయిచ్చాను గాని తలిదండ్రులను ఆస్థితిలోవిడిచిపెట్టి వెళ్లడానికి నువ్వు అంగీకరించలేదు. నీవేస్వయంగా కష్టపడైనా వాళ్లకు యిబ్బందిలేకుండా చూడగలవని నీకుధైర్యంవుండేది. ఆనాడు నీవన్నమాటలు—మనస్ఫూర్తిగా ప్రయత్నిస్తాను: భగవంతుడే సహాయంచేస్తాడు'—నేనింతవరకు మర్చిపోలేదు. ఉపాధ్యాయినిగాఉండి నెలకు యిరవై రూపాయలు సంపాదించగలిగితే మీ నాన్నగారిని సొమ్ము ఖర్చుచేయకుండా సంసారాన్ని సర్దుకోగలవని తలంచావు. నీకై నేను ప్రయత్నించానుగాని వాళ్లదగ్గరవెళ్లి ప్రాధేయపడడంనాకు అనుభవంలేనిచేత నాప్రయత్నం వ్యర్థమైపోయింది. నువ్వు చదువు సాగించి బి. యే. ప్యాసయినావు—'

ఔనంటూ తలవూపింది బుల్‌బుల్.

'మనస్ఫూర్తిగా ప్రయత్నిస్తాను; భగవంతుడే సహాయంచేస్తాడు'— ఆమాటలు నాహృదయంలో నాటుకపోయాయి, నెలకు ముప్పైరూపాయల ఆదాయంతో నీదెంతమహోత్కృష్ట జీవితమో, మూడువేల రూపాయిలతో నాదెంతవ్యర్థ జీవితమోఒక్కక్షణంలో గ్రహించాను, ఆరెండుమాటలే యీప్రపంచాన్ని—అందులోఉండే బాధ్యతనుగుర్తింపజేసి నాజీవితంలో సంకల్పమన్నది నెలకొల్పగలిగాయి. అమాట లెవరివి? —ఈనాడునూతన సిద్ధాంతములతో యీసూక్తులను నడిపించే యీఅద్భుతవ్యక్తివే?'

బుల్‌బుల్ మౌనంగానేవుండి చెమ్మగిలినకండ్లతో నన్ను నిదానంగా చూడసాగింది.

'ఆనాడే నా జీవితారంభమైంది. నాలో అణగి ఉన్న ఉన్నతాశయాలను వెలువరించి నన్ను నేను గుర్తించుకోనేటట్టుచేసి నా విద్యుక్తధర్మాన్ని నెరవేర్చ దారిచూపావు—ఆనాడు, బుల్‌బుల్! నువ్వు పద్దెనిమిదేండ్ల బాలికవు!'

బుల్‌బుల్ కుర్చీనుండిలేచి నా శిరస్సు తన రెండు చేతులతో పట్టినా ముఖం పైకెత్తింది. ఒక అశ్రుకణం నా నుదిటిపై పడింది. వెంటనే తనచీర చెరగుతో వత్తివేసి, "మామయ్యా! అధిపరురోడ్డులో ముఖ్యంగా సాయంత్రపువేళలలో నీకు ఉబుసుపోదనుకుంటాను' అని అంది.

'అవును బుల్‌బుల్—అప్పుడప్పుడు—'

'మామయ్యా నీదగ్గర చదువుకున్న రోజులలో యెంత హాయిగావుండేది. మరల నీదగ్గరకు చదువుకొందుకు రాగలిగితే యెంతబాగుంటుంది.'

'అంతటి అదృష్టమా! మరల ఆ సంతోషదినాలు వస్తాయా!!'

'ఈ లైబ్రరీ తాళంచేతులు యింకా నాదగ్గరనే ఉండాలనా?'

'శాశ్వతంగా యీ లైబ్రరీనీదైపోయింది. ఆతాళం చేతులు నీదగ్గరే ఉంటాయి, గాని బుల్‌బుల్ యీ మామయ్యమాత్రం నీకు చదువునేర్పేటందుకు అక్కడ ఉండడు–ఇకముందు నీజీవితంలో నేర్చుకోవలసిన పాఠాలు ఆ భగవంతుడే నేర్పుతాడు.'

(అనువాదకురాలు—అల్లిక జయలక్ష్మి.)